



మూడు చక్రాల సైకిళ్లను అందిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనిస్తాం

జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో విభిన్న ప్రతిభవంతుల సమస్యలను పరిష్కరించి, వారికి అన్ని విధాలా చేయూతనిచ్చేందుకు కషి చేస్తామని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను మంగళవారం నగరంలోని ఎస్‌ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల రూస ఆడిటోరియం హాల్‌లో నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంఘ ప్రతినిధులు, సంఘ నాయకులు వారికి ఎదురవుతున్న సమస్యలు యూడిఐడి, సదరన్ ధ్రువపత్రాల జారీ, బస్సు పాసులు, విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాక్ ఉద్యోగాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. వికలాంగులకు ప్రభుత్వం నుంచి అందే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు మూడు మూడు చక్రాల సైకళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఐసిడిఎస్ పీడీ బియన్.శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బు కొఠారి, సూపరింటెండెంట్ వెంకటరమణ, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.



హంద్రీనీవాను.. అలామార్చుకున్నారు...!

◆ మొదటి దశ వెడల్పు తగ్గించి.. రెండో దశ లైనింగ్
◆ రెండో దశ లైనింగ్‌కు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా మొదటి దశ కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు తగ్గించే యోచనలో ప్రభుత్వముంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారుల సమావేశంలోనే దీనిని వెల్లడించారు. వరదల సమయంలో హంద్రీనీవా ద్వారా అదనంగా నీరు తీసుకోవాలన్న యోచనలో కాస్త వెనక్కు తగ్గినట్టైంది. రెండో దశ లైనింగ్ పనులను చేపట్టాలని నిర్ణయించడమే కాకుండా పనులకు నిధులు మంజూరు చేస్తూ మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాలువ సామర్థ్యం పెంచకుండా లైనింగ్ చేపడితే అదనంగా చేకూరే ఉపయోగమేమీ లేదనే భావన విపక్షాలు, రైతుల నుంచి వ్యక్తం అవుతోంది.

మొదటి దశ ప్రవాహ సామర్థ్యం కుదింపు

హంద్రీనీవా మొదటి దశ అంటే శ్రీశైలం డ్యామ్ మల్యాల వద్ద నుంచి జీడిపల్లి వరకు వస్తుంది. అక్కడి నుంచి దిగువకు గొల్లపల్లి, కదిరి మీదుగా కుప్పం వరకు రెండో దశ 40 టిఎంసిల నీటిని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. 2012లో ఈ ప్రాజెక్టు మొదటి దశకు నీళ్లు ఇచ్చారు. అప్పటి నుంచి ఏటా హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరొస్తోంది. ఇప్పుడున్న కాలువ ప్రవాహ సామర్థ్యం 2800 క్యూసెక్కులు. ఈ ప్రవాహ సామర్థ్యంతో మూడు జిల్లాలకు సాగు, తాగునీటిని పూర్తి స్థాయిలో అందివ్వడం సాధ్యం కాదని పది వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో హంద్రీనీవా కాలువ ప్రవాహ సామర్థ్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చింది. వరదలొచ్చి వృథాగా నీరు దిగువకు పోతున్న సమయంలో రోజుకు ఒక టిఎంసి చొప్పునైనా నీరు ఈ కరువు ప్రాంతానికి అందించి నిలువ ఉంచుకుంటే ప్రయోజనమని ఈ డిమాండ్‌ను తీసుకొచ్చారు. ఇప్పుడున్న కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ 2021 వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు టెండర్లు కూడా ఆహ్వానించింది. ఇదే కాలువకు సమాంతరంగా మరో నాలుగు వేల క్యూసెక్కులతో రెండో దపాలో ఒక కాలువను తీసుకొస్తామని కూడా గతంలో ప్రకటించింది. ఈ పనులు టెండర్ దశలోనే ఆగిపోయాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు కాకుండా 3850 క్యూసెక్కులతోనే తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పుడున్న 12 పంపులతో దీన్ని అదే విధంగా నడుపవచ్చునని బావిస్తోంది. దీనిపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మేరకు ప్రవాహ సామర్థ్యాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

రెండో దశ లైనింగ్

మొదట దశపై తర్జభర్జనలు నడుస్తున్న క్రమంలోనే రెండో దశ లైనింగ్‌కు ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులిచ్చింది. 216వ కిలోమీటరు నుంచి 400 కిలోమీటరు వరకు 12 భాగాలకు పనులను విడగొట్టి లైనింగ్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.936.70 కోట్లు కేటాయించింది. ఇప్పుడున్న కాలువలో నీరు చివరి వరకు వెల్లడం ఇబ్బందికరంగా ఉందని భావించి నీటి వేగాన్ని పెంచేందుకుగానూ ఈ లైనింగ్‌ను చేపడుతోంది. తద్వారా జీడిపల్లి నుంచి చివరనున్న కుప్పం వరకు నీటిని అందించవచ్చన్న యోచనలో ప్రభుత్వమున్నట్టు తెలుస్తోంది.



వెడల్పు లేకుండా లైనింగ్ పనులతో ప్రయోజనం లేదు



కాలువను వెడల్పు చేపడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టాలి. అలా కాకుండా కేవలం లైనింగ్ మాత్రమే చేపడితే ప్రయోజనం లేదు. ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ పనులు చేసినట్టు ఉంటుంది. ఈ ఏడాది శ్రీశైలం డ్యామ్ పొంగిపొర్లినా అనంతపురం జిల్లాకు అదనంగా నీరు తీసుకోలేకపోవడానికి ప్రధాన కారణం కాలువ ప్రవాహ సామర్థ్యం లేకపోవడమే. ఈ కాలువ సామర్థ్యం పెంచకుండా లైనింగ్ చేపడితే అదనంగా చేకూరే ఉపయోగమేమీలేదు. కావున ప్రభుత్వం పునరాలోచించి మొదటి విడత కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలి.

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

వర్షంతో వరిపంట నష్టం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో తుంగభద్ర ఆయకట్టు కింద సాగుచేసిన వరిపంట అకాల వర్షంతో నేలవాలింది. బొమ్మనహాల్, కురవల్లి, చంద్రగిరి, ఉంతకల్, ఉద్దేహాల్, గోనెహాల్, శ్రీధరఘట్ట, శ్రీరంగాపురం, ఉప్పర గోవిందవాడ, బండూరు, కొలగానల్లి, మైలాపురం, అరేసముద్రం, సిద్ధరాంపురం గ్రామాల రైతులు వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఈ సమయంలో సోమవారం రాత్రి కురిసన వర్షానికి పలు గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టపరిహారం ఇచ్చేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి కోరింది. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇవ్వాలని ఆమె కోరారు.



వర్షంతో నేలకూలిన వరి పంట

10 అడుగుల లోతుకు పైప్‌లైన్..!

మరమ్మతులకు గుర్రైతే కార్మికులకు కష్టం

ప్రజాశక్తి-నార్పల

నార్పల పంచాయతీలో నీరు సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన పైపులైన్లు పాతాళానికి చేరాయి. ఎక్కడైనా పైపులు పగిలిపోయి ఏదైనా కాలనీలకు నీరు సరఫరా కాకపోతే మరమ్మతులు చేయడానికి పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత 30 సంవత్సరాల క్రితం ట్యాంక్ నిర్మించి కుళాయిల ద్వారా నార్పలకు నీటిని సరఫరా చేస్తున్నారు. కాలక్రమంలో అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లపై రోడ్లు వేయడంతో గతంలో ఏర్పాటు చేసిన పంచాయతీ పైపులు సుమారు పది అడుగుల లోతుకు వెళ్లాయి. నీటి సరఫరాలో ఏదైనా అంతరాయం కలిగినప్పుడు వాటిని మరమ్మతులు చేయడానికి పంచాయతీ కార్మికులు అంతలోతుకు దిగి మరమ్మతులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా కోటవీధికి నీరు సరఫరా కాలేదు. గూగూడు రోడ్డులో పంచాయతీ పైపు పగిలిపోయిందన్న అనుమానంతో పంచాయతీ కార్మికులు గుంతను తీయగా సుమారు పది అడుగుల లోతులో పైప్‌లైన్ కన్పించింది. మమ్మతులు జరిగిన ప్రతిసారీ ఇంత లోతు వరకు గుంతలు తీయడం ఇబ్బందిగా మారిందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పాత పైపులైన్లను తీసేసి వాటి స్థానంలో కొత్త పైపులైను ఏర్పాటు చేసి నీరు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యన పది అడుగుల లోతుకు దిగి పైప్‌లైన్‌కు మరమ్మతుల చేస్తున్న పంచాయతీ కార్మికుడు

పక్కాగా ఈ-పంట నమోదు

జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి -అనంతపురం

రబీలో పంట సాగు చేసిన రైతులను గుర్తించి అన్ని వివరాలతో పక్కాగా ఈ పంట నమోదు చేయాలని వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూయ రబీ 2024-25కు సంబంధించి ఈ పంట నమోదు ప్రక్రియ ప్రారంభం అయ్యిందన్నారు. దీనిపై జిల్లా, డివిజన్, మండల స్థాయిలో అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. రబీ 2024-25 సంవత్సరంలో ఖరీఫ్ 2024 ఈపంట నమోదులో ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. పంట విస్తీర్ణం, రకం, ప్రభుత్వ ద్వారా రాయితీతో ఇచ్చిన డ్రిప్, స్ప్రింక్లర్ల వివరాలను ఈ పంట ద్వారా నమోదు చేయాల్సి ఉందన్నారు. పంట నమోదు, ఈకైవైసీని ఫిబ్రవరి 25 తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు రైతుల జాబితా ప్రదర్శన, ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీలోపు ఫిర్యాదుల స్వీకరణ, ఫిబ్రవరి 15 తర్వాత తుది ముసాయిదా జాబితా విడుదల చేయాలన్నారు.

రబీ పంటల బీమా చేయండి

వాతావరణ ఆధారిత పంటల బీమా (ఆర్‌డబ్ల్యుబిసిఐ) ద్వారా పంటల బీమాను రైతులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి తెలియజేశారు. బీమా చేయిస్తే తుఫాను, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకతి వైపరీత్యాలు వల్ల పంటలు దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. సహాయం అందించడం జరుగుతుంది. పంటలు సాగు చేసి నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించిన కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులన్నారు. ఆయా పంటల ఆధారంగా రైతు ప్రీమియం, రైతు వాటా కింద బీమా చేయాల్సి ఉంటుందన్నారు. రైతు ఆధార్ కార్డు, భూమి, కౌలు కార్డు, పంట వేసిన ధ్రువపత్రం (సంబంధిత రైతు సేవా కేంద్రం ద్వారా పొందవలెను), బ్యాంకు పాస్‌పుస్తకం, ఫోన్ నెంబర్ సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించిన తక్షణ రసీదును పొందవచ్చని తెలిపారు. పంట వేసిన ధ్రువపత్రం జారి కోసం దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రంలో ఉచితంగా దీనిని ఇస్తారన్నారు. పంటల బీమా నమోదుకు సంబంధించి పప్పు శనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, టమోటా పంటలకు ఈ నెల 15, వరికి ఈ నెల 31వ తేదీ ఆఖరు అన్నారు.

డ్రోన్లతో నేరాలకు చెక్ : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

డ్రోన్ల ద్వారా అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు చెక్ పెట్టాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల నుంచి డ్రోన్ల ఆపరేటింగ్ కోసం ప్రత్యేకంగా 30 మంది పోలీసు సిబ్బందిని కేటాయించి వీరందరికీ స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం, మున్సిపల్ పట్టణాలు మండల కేంద్రాల శివార్లలో ఓపెన్ డ్రింకింగ్ చేసి న్యూసెన్స్ క్రియేట్ చేయడం, పేకాట ఆడటం, గంజాయి సేవించడం, అమ్మాయిలను ఈవ్ టీజ్ చేయడం, ఒంటరిగా వెళ్లే మహిళలు కావచ్చు లేదా వ్యక్తులునైనా బెదిరించడం, చోరీలకు పాల్పడటం, చైన్ స్నాచింగ్ చేసి పరారవ్వడం... ఇలా నేరాలకు పాల్పడేవారికి డ్రోన్లతో చెక్ పెట్టవచ్చన్నారు. 3 కిలోమీటర్ల పరిధిలోని ప్రదేశాలను కవర్ చేస్తూ ఆ ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, నేరాల విజువల్స్ డ్రోన్లలో సేవ్ అవుతాయన్నారు. అంతేకాకుండా ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు జరిగే సమయంలో డ్రోన్లు బాగా దోహదపడుతాయన్నారు. ప్రముఖుల బందోబస్తు, అధికంగా జనం గుమిగూడే కార్యక్రమాలలో కూడా నేరస్తులపై నిఘా వేయవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో సహాయ, కార్యక్రమాలు చేపట్టేందుకు, ప్రజలను రక్షించేందుకు ఇవి ఉపయోగపడుతాయన్నారు. కొన్ని సందర్భాలలో పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రదేశాలకు డ్రోన్లను పంపి అక్కడి పరిస్థితులను సమీక్షించుకునే వీలుంటుందన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం శివారు ప్రాంతాల్లో 3 డ్రోన్లను ఎగుర వేస్తున్నామని, త్వరలోనే జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధుల్లో డ్రోన్లు ఎగురవేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌పై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ పి.జగదీష్



పొంచి ఉన్న ప్రమాదం

బుక్కాపురం-ఆరవేడు మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని బుక్కాపురం, ఆరవేడుకు మధ్యలో చెలిమి కోనకు వెళ్లే దారి పక్కన 11కెవి విద్యుత్ లైన్ తెగిపోయే చివరి అంచుకు చేరుకున్నాయి. ఇటీవల దంతలపల్లి గ్రామ సమీపంలో 11 కెవి విద్యుత్ లైన్ తెగి ఇద్దరు వ్యక్తులపై పడి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అటుగా వెళ్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నెలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రాచానపల్లి సచివాలయం తనిఖీ

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ పరిధిలోని రాచానపల్లి సచివాలయాన్ని ఎంపిడిఒ దివాకరరావు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కార్యదర్శి రఫీ ఛాంబర్‌లో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. తర్వాత హౌస్ మ్యాపింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీలో చేపట్టిన సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలపై ఆరాతీశారు.

బాధితులకు అండగా...

ప్రజాశక్తి-పుట్లూరు

గార్లదిన్నె సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు మండల పరిధిలోని ఎల్లుట్లకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు అండగా నిలుస్తున్నారు. గార్లదిన్నె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన 8 మంది కూలీలు మృతిచెందిన విషయం విధితమే. ఈనేపథ్యంలో 8 మంది కుటుంబాల్లోని 68 మందికి 11 రోజులుగా గ్రామానికి చెందిన అన్నదమ్ములు లగినేని వెంకటస్వామి, కృష్ణయ్య, నాగరాజు మూడు పూటలా ఆహారం అందిస్తున్నారు. ఆయా కుటుంబాలకు భోజనం అందిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాధిత కుటుంబాలకు ఆహారం అందజేస్తున్న లగినేని సోదరులు

టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల కల్పించి త్వరగా లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని టిడ్కో గృహాలు, ఆర్డీటీ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఆర్డీటీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం లేకపోవడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు, కాలనీ వాసులు అబ్దుల్, జబీఉల్లా, రామకృష్ణ, మంజు, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి, అధికారులు

సుబ్బరాయసాగర్ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు హామీ మేరకు చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తామన్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా ప్రవాహం 130 రోజులపాటు ఒకేలా ఉండేవిధంగా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సుబ్బరాయ సాగర్ నుంచి నీరు విడుదల చేయడంతో పుట్లూరు, గరువుచింతల, కోమటికుంటల గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట కులశేఖర్‌రెడ్డి, బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, జెఆర్.పేట బాబు, ఎల్‌కె చెన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రంగయ్య, శివారెడ్డి, రామమునిరెడ్డి, రామచంద్రనాయుడు, ఎల్‌కె.గోపాల్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, రామానాయుడు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బ్లాక్‌స్పాట్స్ పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం మీదుగా వెళ్ళే జాతీయ రహదారి–44పై ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను ఎస్పీ పి.జగదీష్ మంగళవారం పరిశీలించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలు రాప్తాడు జంక్షన్, అయ్యవారిపల్లి క్రాస్, కక్కలపల్లి క్రాస్, తపోవనం కూడలి, శిల్పారామం సమీపంలోని బ్రిడ్జి, నారాయణ కళాశాల కూడళ్లలో పర్యటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సమీక్షించారు. అంతేకాకుండా జాతీయ రహదారిపై డ్రోన్లు ఆపరేట్ చేసి ప్రమాదాలకు కారణాలపై ఎస్పీ చూపించారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలంటే ఎలాంటి ప్రత్యామ్నాయాలు, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. అయ్యవారిపల్లి క్రాస్ వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, అయ్యవారిపల్లి క్రాస్ నుంచి రాప్తాడు వరకు హైవేపై ఉన్న మీడియన్ బ్రేక్ చేసి వాటి స్థానాన బారికేడింగ్ చేయాలని సూచించారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు హైవేపై రోడ్డు దాటకుండా వీలుంటుందన్నారు. తపోవనం కూడలి వద్ద సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, క్యాట్ ఐ స్, లైటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిసి వీరరాజు, అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు, సిఐలు వెంకటేష్ నాయక్, శ్రీహర్ష, శేఖర్, రఘుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్, అధికారులు

రైతులను విస్మరించిన ప్రభుత్వం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-అనంతపురం

వర్షాలు, పంటలకు తెగుళ్లతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది పంట నష్టానికి సంబంధించిన బీమా సొమ్మును ఇప్పటికీ చెల్లించలేదని మండిపడ్డారు. గతంలో వై ఎస్ జగన్ సంబంధించిన పంట నష్టపరిహారం ఆ సీజన్‌లోనే చెల్లించేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరించడం బాధాకరమన్నారు. అలాగే రైతు భరోసాను అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చి రూ.20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మరోవైపు పంటలకు గిట్టుబాటు ధర, కళ్లాల్లోనే కొనే చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు బీమాతోపాటు అన్నదాత సుఖీభవ సాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పాలిటెక్ ఫెస్ట్-2024 గోడపత్రికలు విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 4, 5వ తేదీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న పాలిటెక్ ఫెస్ట్–2024 పోస్టర్లను మంగళవారం విప్ కాలవ శ్రీనివాసులు నివాసంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా విప్ కాలవ మాట్లాడుతూ ప్రాంతీయ స్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన 'పాలిటెక్ ఫెస్ట్–2024) పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ సాంకేతిక ప్రదర్శనను సందర్శించి స్ఫూర్తి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.


గోడపత్రికలు విడుదల చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ఉరవకొండ : మండలంలోని చిన్నముష్టూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రాంతీయ పాలిటెక్–2024 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్అలీ, శాఖాధిపతులు వై.సురేష్‌బాబు, సులోచన, అధ్యాపకులు జి.రాజేష్‌కుమార్, కె.ధనలక్ష్మి, కె.వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఉర్దూ విభాగానికి చెందిన 17 మంది మైనార్టీ విద్యార్థులకు విశ్రాంతి వృక్షశాస్త్ర అధ్యాపకులు ఎస్.సలాం మంగళవారం ఆర్థిక చేయూత అందించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఉన్నత విద్యాపరంగా ప్రోత్సహించేందుకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున సలామత్ విద్య ట్రస్టు ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఉర్దూ విభాగాధిపతి జంషీద్ బేగం, వృక్షశాస్త్ర విభాగాధిపతి అమతలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్ సలాం

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

అలుపెరుగని పోరాటాలు చేయడం ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న సిఐటియు కాలనీలో కామ్రేడ్ సుంకమ్మ (భవాని) ప్రాంగణంలో సిపిఎం పట్టణ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ధరలు అదుపు చేయాలంటే రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు డీఎస్సీ వాయిదాతో నిరాశే ఎదురవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే రిక్రూట్మెంట్ ప్రారంభించి ఉద్యోగ, ఉపాధి కల్పనకు పరిశ్రమలు స్థాపించాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఆచూకీ కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇసుక, మద్యం మాఫియా చెలరేగిపోతోందన్నారు. మద్యం దుకాణాల విచ్చలవిడితనం వల్ల ప్రజల ఆదాయానికి గండి పడుతూ ఆరోగ్యం నాశనం అవుతోందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలన్నారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజులో ఆందోళనలను చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జగ్గలి రమేష్, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సమిష్టి కృషితో అభివృద్ధికి బాటలు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమిష్టి కృషితో అభివృద్ధి బాటలో నడుద్దామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పరిటాల రవి కళ్యాణ మండపంలో డివిజినల్ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుదామన్నారు. అన్నిశాఖల నివేదికల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్లు అవసరమని నివేదికలు ఇవ్వగా సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదునెలలకే ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని దశలవారీగా నెరవేర్చేదిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, హౌసింగ్ డిఇ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, టిడిపి డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణగా పోలీసు సేవలు

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలకు సేవ చేయడంలో పోలీసు ఉద్యోగానికి మించింది మరొకటి లేదని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యోగ విరమణ చేసిన స్థానిక వన్‌టౌన్ ఎస్ఐ ఖాదర్ బాషా, ఏఆర్ విభాగం ఆర్ఎస్ఐ ముస్తఫా, వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజం కోసం వీరంతా సుమారు మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి జీవితాలను పునీతం చేసుకున్నారన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం ముదావహమన్నారు. పోలీసుశాఖలో చిన్న ఉద్యోగంతో జీవితం ప్రారంభించి ఎస్ఐ ఉద్యోగం వరకు ఎదగడం హర్షణీయమన్నారు. శేష జీవితంలో కూడా ఉల్లాసంగా జీవించేలా వాకింగ్, తదితర అలవాట్లను పాటించాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు దోహదపడాలని కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం చేశారు. పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి (పరిపాలన), ఇలియాజ్ బాషా (ఏ.ఆర్), డిటిసి డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఆర్ఐలు మధు, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి శంకర్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రమ్మ, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ పి.జగదీష్

రెండు గ్లాసుల పద్ధతిని రూపుమాపాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండలంలో రెండు గ్లాసుల పద్ధతిని రూపుమాపాలని దళిత సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు, పోలీస్‌స్టేషన్‌లో సిఐ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు మధ్యానప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని గోనబావి గ్రామంలో ఉన్న ఓ హోటల్‌లో దళితులకు ప్రత్యేక గ్లాసులు స్థలం కేటాయించి వివక్ష చూపడం బాధాకరమన్నారు. ఇదేమని ప్రశ్నింగా దళితులపై దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ల గడుస్తున్నా ఇంకా కుల వివక్ష కొనసాగడం ఏంటని ప్రశ్నించారు. హోటళ్లతోపాటు బార్బర్ దుకాణాల్లో కూడా వివక్ష కొనసాగుతోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రెండు గ్లాసుల పద్ధతిని రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గోవిందప్ప, రుద్రప్ప, గంగాధర్, గంగారాం, మంజునాథ, పీడీ వన్నూరప్ప, మంజునాథ, రమేష్ పాల్గొన్నారు.

హోటల్ యజమానులకు కౌన్సిలింగ్

గోనబావిలో రెండు గ్లాసుల పద్ధతిని అవలంభిస్తున్న హోటల్ యజమానులకు గ్రామ పెద్దల సమక్షంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సిఐ వెంకటరమణ కౌన్సిలింగ్ ఇచ్చారు. హోటళ్లలో వివక్ష చూపరాదన్నారు. వివక్ష చూపితే చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఈశ్వరయ్య హెడ్ కానిస్టేబుల్ రఘు, ఆర్ఐ రామాంజనేయులు, విఆర్ఒ వీరేష్, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-రాప్తాడు

నియోజకవర్గవ్యాప్తంగా టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. మంగళవారం కనగానపల్లి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని మండలాల వారీగా సభ్యత్వ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యత్వ నమోదును సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ అంతా బాగా కష్టపడి పని చేశారని, అయితే ఇంకా కొన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు చాలా తక్కువగా ఉందన్నారు. సభ్యత్వ నమోదు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కార్యకర్తలకు వివరించాలన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరును కలిసిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి-పామిడి

ఆలూరులోని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ స్వగృహంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఎమ్మెల్యేతోపాటు ఆయన తనయుడు, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి జింకల సంజీవకుమార్, సీనియర్ నాయకులు పాటిల్ శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జయరామ్‌ను సన్మానిస్తున్న పామిడి మండల టిడిపి నాయకులు

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొండుపల్లి, కడదరగుట్టపల్లి కిష్టిపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రత్యేక సమావేశమై మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలకు ప్రజలు గురికావద్దన్నారు. ఎవరైనా చరవాణిలకు సమాచారం కావాలని అడిగితే ఇవ్వరాదన్నారు.

నూతన బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

విజయవాడ పండిట్ నెహ్రూ బస్సుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన నూతన బస్సులను ఎపిఎస్, ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మంగళవారం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే నూతన బస్సులను ప్రారంభించినట్లు పూల నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్‌లు కొనకళ్ల నారాయణ, అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.


నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఛైర్మన్‌లు

అంగన్వాడీ మృతికి నివాళి

బొమ్మనహాల్ : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని శ్రీధర్‌ఘట్ట అంగన్వాడీ కేంద్రంలో పని చేస్తున్న అంగన్వాడీ సి.సుశీలమ్మ (55) మృతికి పలువురు నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్, తదితరులు సుశీలమ్మ ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

బదిలీ అధికారులకు సన్మానం


బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానిస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి-యల్లనూరు

బదిలీపై వెళ్తున్న అధికారులను మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎంపిడిఒ వీరరాజు, ఇఒఆర్‌డి విజయ్‌శేఖర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దాదాఖలందర్, టైపిస్టు రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శులు గీత, ఉమాదేవి, గంగాదేవి, సుజాత, కృష్ణవేణి, అభిదుల్లాకు శాలువాలు కప్పి బొకేలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంగాదేవి, జడ్పిటిసి భోగాతి విజయప్రతాప్‌రెడ్డి, ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఎపిఒ షబ్బీర్, ఇసి బబులు, సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, కుళ్లాయప్పనాయుడు, నారాయణ స్వామి, పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం నగరంలోని సిఎఎన్ పెట్రోలియం, నయారా ఎనర్జీ లిమిటెడ్, గోవిందరెడ్డి పెట్రోలియం బంకుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా స్టాకు నిల్వ, అకౌంట్స్ వివరాలను పరిశీలించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

బొమ్మనహాల్ : మండలంలో త్వరలో జరగనున్న సాగునీటి ఎన్నికల నిర్వహణపై మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ ఏడు టీములుగా ఒక చెరువుతోపాటు 8 క్లస్టర్లలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్లస్టర్‌కు ఓ ప్రత్యేక అధికారి, సహాయకులు, మరో ముగ్గురు అధికారులు పని చేస్తారన్నారు. మొత్తం 1,420 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారందరూ ఓటుహక్కు వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

రెవెన్యూ అధికారులకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండలో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయన్నారు. కోట్లాది రూపాయల స్థలాలను ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్థలాల కబ్జాపై గతంలో తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వెంటనే కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి, మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు సీనప్ప, మురళి, రవికుమార్, వెంకటేశులు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంతోపాటు గూగూడు సచివాలయాలను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్వర్ణ పంచాయతీ అప్‌లోడింగ్ పనులను పరిశీలించి ఇఒఆర్‌డి శైలజారాణి, కార్యదర్శులు శ్యామల, కీర్తన, సర్పంచులు సుప్రియ రమణకుమారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో పడుతున్న ఇబ్బందులను పలువురు వాహనదారులు డిపిఒ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మాంస విక్రయశాల నిర్మించాలని, ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ప్లాస్టిక్ వాడకం కూడా ఎక్కువగా ఉందని దాన్ని నియంత్రించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పన్నుల వసూళ్లు చేపట్టాలన్నారు. మండలంలోని చెత్త సంపద కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తర్వాత గూగూడు పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పరశురాం, విఆర్ఒ నిరంజన్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణ పంచాయతీ అప్‌లోడ్ పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

310 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అనంత పోలీసులు అరెస్టు చేశారు. వారిని రూ.22 లక్షల విలువజేసే 310 గ్రాముల బంగారు నగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంకు చెందిన షేక్ ఖాజాపీరా అలియాస్ ఖాజా, మహేష్, జమీర్‌లు ముఠాగా ఏర్పడి ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే వారు. వీరిలో షేక్ ఖాజాపీరా అలియాస్ ఖాజా కీలక నిందితుడు. పెయింటర్‌గా పని చేసే ఇతనికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలున్నారు. కుటుంబ పోషణకు అతను చేస్తున్న సంపాదన సరిపోక 2021 నుంచి తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాతో సహా ఆంధ్రప్రదేశ్‌లో 14, కర్నాటక రాష్ట్రం బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణాలోని శంషాబాద్‌లో 4 దొంగతనాలు చేశాడు. ఈ కేసుల్లో ఇతను జైలుకు వెళ్లి ఈ ఏడాది మార్చిలో విడుదలై వచ్చాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత ధర్మవరానికి చెందిన మహేష్, జమీర్‌లను కలుపుకుని మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ముగ్గురూ కలిసి అనంతపురం రూరల్, త్రీ టౌన్, 4 పట్టణ, యాడికి, ఇటుకలపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో 10, కర్నాటకలోని కోలార్‌లో 4 దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనాలు చేసే ముందు ముగ్గురూ కలిసి కారును బాడుగకు తీసుకుని జమీర్ డ్రైవ్ చేస్తుండగా మహేష్ తాళం వేసిన ఇళ్లను గమనిస్తుంటే ఖాజా ఒక్కడే వెళ్లి దొంగతనం చేసేవాడు. దొంగతనాల నియంత్రణపై పోలీసులు నిఘా ఉంచడంతో అనంతపురం సమీపంలోని కళ్యాణదుర్గం రోడ్డు రజాక్ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులను ముగ్గురిని మంగళవారం ఉదయం పట్టుకున్నారు. వీరి నుంచి ఒక కారు, 310 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన అనంతపురం సీసీఎస్ సిఐ ఇస్మాయిల్, రూరల్ సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ కె.రాంబాబు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ఆంజనేయ ప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌లను ఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న ఎస్పీ

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు


పామిడి : పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన బోయ వెంకటేష్ (26) సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. రాత్రి సంత మార్కెట్ వీధిలో ఉన్న ఓ రేకుల షెడ్డు కింద స్నేహితులతో కలిసి కూర్చొని మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి తల్లి లక్ష్మీదేవి, సోదరి మమత ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, ఎమ్మెల్యే సోదరుడు నారాయణ, తదితరులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అలాగే ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు కూడా ఆసుపత్రిలో నివాళులర్పించారు.

పొట్టేళ్లు చోరీ

నార్పల : మండల కేంద్రంలోని స్థానిక గవ్వలవీధి చెందిన రైతు శ్రీకాంత్‌కు చెందిన పొట్టేళ్లను మంగళవారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తన ఇంటి ఆవరణలో ఉన్న షెడ్డులో పొట్టేళ్లను ఉంచి తాళాలు వేశాడు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి సమయంలో షెడ్డుకు వేసిన తాళాలను పగులగొట్టి రెండు పొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.40వేలు ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులోని గుత్తి కోట రైల్వే స్టేషన్ ఎదురుగా మంగళవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన ప్రవీణ్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో గుత్తికి వచ్చాడు. అనంతరం తిరిగి గ్రామానికి వెళ్తుండగా కోట రైల్వే స్టేషన్ ఎదురుగా మలుపు వద్ద వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్ ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పంటసాగు, తెగుళ్లపై పామిడి, పుట్లూరు మండలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బీమా ప్రీమియం చెల్లించుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 15వతేదీలోపు రబీలో పంటలు సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని అనంతపురం మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మన్నీల, ఉప్పరపల్లి గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా కంది పంటను ఆశించే పురుగులు, తెగుళ్లను వివరించి నివారణకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ శివ, వ్యవసాయ విస్తరణాధికారి బి.మురళీకృష్ణ, రైతు సేవాకేంద్రం సహాయకులు విజయకుమార్, ఎంపిఇఒలు అపర్ణ, చంద్రశేఖర్, మన్నీల సర్పంచి త్రిలోకనాథ్, ధనుంజయ, కృష్ణయ్య, రాము, నారా కాటమయ్య, వెంకటేష్, రామనయుడు, అల్లు కిరణ్, బయన్న, రైతులు కుళ్లాయప్ప, గోవింద్, బండి కిష్టయ్య, బండి నారాయణస్వామి, బుడుగా కృష్ణ, నవీన్, శివయ్య, ఉప్పర తిరుపతయ్య, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈనెల 15వ తేదీలోపు పంటలు సాగు చేసిన రైతులు బీమా సొమ్ము చెల్లించాలని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు సేవాకేంద్రం పరిధిలోని పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేసి పలు


శింగనమల మండలంలో రైతు ఫొటో తీసుకుంటున్న అధికారులు

'పొలం పిలుస్తోంది'లో అధికారులు

విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ కైలాష్, ఆత్మ ఎటిఎం కిన్నెర, ఉరవకొండ రైతు సేవా కేంద్ర సిబ్బంది లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని భైరవానితిప్ప రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత వివిధ పంటల్లో రైతులు అవలంభించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నందకిరణ్, రైతు సేవాకేంద్రం సిబ్బంది సాయితేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పప్పుశనగ పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కాత్యాయిని, ఎఇఒ హరి, ఎంపిఇఒలు సుమతి, సూర్యనారాయణరెడ్డి, నాగలింగేశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పంటలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా బీమా ప్రీమియం చేయించుకోవాలని వ్యవసాయ అధికారి లీనా వసుంధర సూచించారు. మంగళవారం మండలంలోని రామరాజుపల్లి, పి.కొండాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ రామాంజనేయులు, విఎఎ ఉషా, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : రైతులు రబీలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో రైతులు సాగు చేసిన పొలాలను ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2024-25 రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ తీసుకుని మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాలకు వెళ్లి పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ ఆదినారాయణ, రైతులు పెద్దిరెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అనంతపురం మండల వ్యవసాయ శాఖ అధికారిణి జె.శశికళ

నార్పల : మండల పరిధిలోని సోదనపల్లి, గంగనపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రైతుసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా ఈనెల 15వతేదీలోపు రైతులు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు. అలాగే పంట నమోదు చేసుకోవాలన్నారు.


నార్పలలో రైతు ఫొటో తీసుకుంటున్న అధికారులు

వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో మంగళవారం వికలాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను వారి తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. అప్పుడే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేష్‌బాబు, పుష్పావతి, వాణిశ్రీ, సురేష్‌రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాగా మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయంలో వికలాంగులతోపాటు కుటుంబ సభ్యులకు పుల్లారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఓబులరెడ్డి, జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో అశ్వర్థ నారాయణ స్వామి విభిన్న ప్రతిభావంతుల మండల సమైక్య ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఫాదర్‌ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి కమ్యూనిటీ ఆర్గనైజర్ నాగరత్న, వికలాంగ మండల సమైక్య తిరుపాల్, మహాలక్ష్మి, కుళ్లాయమ్మ, నారాయణ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న పాఠశాల-4 ఆవరణంలోని భవిత సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఇఒ కాసేప్ప, శ్రీ వివేకానంద హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ విద్యార్థులతో కలిసి కేక్ కోశారు. తర్వాత పంచిపెట్టారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వివేకానంద స్కూల్ యాజమాన్యం, వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పెద్దపప్పూరు మండలంలో ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీటీ సిబ్బంది, వికలాంగులు


బ్రహసముద్రం మండలంలో మాట్లాడుతున్న వక్తలు

బ్రహ్మసముద్రం : వికలాంగులు సకలాంగులతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి కృష్ణానాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఐఇఆర్‌పిలు అరుణ, సుశీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యశోధ, ఎంఆర్‌సి సిబ్బంది సాంకేతిక నిపుణుడు బసవరాజు, సిఆర్‌పిలు గోపాల్, బూతన్న, మంజునాథ్, విభిన్న ప్రతిభావంతులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య నాయకులు తరిమెల చాకలి నారాయణ, ఆది, మాబు, వికలాంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎం కెవివై) 4.0 మొదటి విడతలో భాగంగా నైపుణ్యాల శిక్షణ కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంకాం, తదితర కోర్సులు చదివిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోగా రాయదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాని కోరారు. పూర్తి వివరాలకు సెల్..91829 20381ను సంప్రదించాలని కోరారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్.శ్రీధర్‌కుమార్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాధికారి పి.వెంకట ప్రతాపరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంకాం, తదితర కోర్సులు చదివిన అభ్యర్థులు నేరుగా బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్..94406 61900, 90109 65230 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి

గుత్తి : భారతదేశ మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు శామ్యూల్, నారాయణరెడ్డి, షేక్షావలి, చెన్నారెడ్డి, గోవిందప్ప, నారాయణశెట్టి, మద్దిలేటి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి : సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని తాడిపత్రి మలేరియా విభాగం అధికారి శ్రీనివాసులు సూచించారు. ఆశాడే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి టెక్నీషియన్‌కు సూచనలు, సలహాలను ఇచ్చారు.

హెచ్‌ఐవిపై అవగాహన అవసరం

నార్పల : హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పెద్దపప్పూరు వైద్యశాల వైద్యులు మహేంద్ర, జహీరా సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పప్పూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవి బాధితుల పట్ల ప్రేమగా వ్యవహరించాలన్నారు. హెచ్‌ఐవి అనేది అంటువ్యాధి కాదన్నారు. కావున వారిపై ఎలాంటి వివక్ష చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ మల్లికార్జున, పర్యవేక్షకులు శ్రీరాములు, అనసూయమ్మ, ఎల్‌టి ఉషా, చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ పెద్దన్న, లింక్‌వర్కర్ మరుతీప్రసాద్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, చైల్డ్ ఫౌండ్ ఇండియా లింక్ వర్కర్లు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు